క్లుప్తంగా

నేటి నుంచి సామాజిక తనిఖీ

నవాబుపేట: మండలంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఈజీఎస్ ఏపీఓ జ్యోతి ఆదివారం తెలిపారు. పదిరోజుల పాటు గ్రామాల్లో తనిఖీ ఉంటుందన్నారు. కాగా ఆదివారం తనిఖీ బృందానికి అన్ని గ్రామాల ఉపాధి రికార్డులు అందించామని వివరించారు.

వికారాబాద్‌లో కలపాలి

గండేడ్: మండలాన్ని వికారాబాద్ జిల్లాలో కలపాలని జేఏసీ చైర్మన్ ముకుందానాగేశ్వర్, యూత్‌కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి హరిందర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో దీక్ష నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌ను నూతన మండలంగా ప్రకటించాలని సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం రిలేదీక్షలు కొనసాగించారు. ఈసందర్భంగా జేఏసీ కన్వీనర్ రామునాయక్ మాట్లాడారు. 12 గ్రామాల మద్దతుతో 246 రోజులుగా రిలేదీక్షలు చేస్తున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంగా ప్రకటించాలని అన్నారు.

ముమ్మరంగా 'స్వచ్ఛతా హీ సేవ'



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 'స్వచ్ఛతా హీ సేవ' ముమ్మరంగా సాగుతోంది. 'మహబూబ్‌నగర్ వర్సెస్ గార్బేజ్'లో భాగంగా ఆదివారం వార్డు నం.46 పరిధిలోని మోనప్పగుట్ట, వ్యవసాయ మార్కెట్ యార్డు, పాత బస్టాండు, 14వ వార్డులోని వీరన్నపేట, పెద్ద శివాలయం, వార్డు నం.19, 40, 41లోని షాషాబ్‌గుట్ట, న్యూటౌన్, 44 వార్డు పరిధిలోని రాంమందిర్ చౌరస్తా, షాబజార్, పాన్‌చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న చెత్తను సేకరించారు. ఆయా చోట్ల స్థానికులను సైతం భాగస్వాములను చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కౌన్సిలర్లు అంజయ్య, షబ్బీర్‌అహ్మద్, వేదవ్రత్; శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వాణికుమారి, హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్ రెడ్డితో పాటు ఆర్పీలు పాల్గొన్నారు.

'పార్టీ కాదన్నా పోటీలో ఉంటా'

నవాబుపేట: కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లారవి ఆదివారం ఏఐసీసీ నుంచి తనకు ఫోన్ వచ్చినట్లు తెలిపారు. జడ్చర్ల పరిధిలో ఎలాంటి అభ్యర్థి ఉంటే అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలమంటూ తనను అడిగినట్లు వివరించారు. కాగా నియోజకవర్గంలో 25 ఏళ్లుగా తాను పార్టీ కోసం పనిచేస్తున్నానని, సీనియర్ నాయకుల సహకారంతో అధికార పార్టీని ఢీకొడతానని ఏఐసీసీకి వివరించినట్లు చెప్పారు. పార్టీ తనను కాదన్నా పోటీలో తప్పక ఉంటానని వివరించినట్లు పేర్కొన్నారు. కాగా నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్న వారిలో రవి ఉన్నారు.

అక్టోబర్ 1న విగ్రహావిష్కరణ

గండేడ్: పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం అక్టోబర్ 1న ఉంటుందని ముదిరాజ్ సంఘం నాయకుడు లక్ష్మయ్య, అధ్యక్షుడు బోయినిగోపాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వివరించారు. పార్టీలకు అతీతంగా కార్యక్రమానికి పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేశవులు, రామచంద్రయ్య, అశోక్ పాల్గొన్నారు.

కారు అద్దం ధ్వంసం చేసిన ఎస్‌ఐ!

నవాబుపేట: మండలంలోని రుద్రారం చెందిన జైపాల్‌రెడ్డి తన కారును ఆదివారం మైసమ్మ దేవాలయంలో పూజలు చేయించి ఇంటికి తిరిగి వస్తున్నాడు. తనిఖీ చేపట్టిన పోలీసులు కారును నిలిపారు. దీంతో జైపాల్‌రెడ్డి ఆగకుండా కారును పోనివ్వడంతో ఎస్‌ఐ పురుషోత్తం లాఠీతో అద్దంపై మోదినట్లు బాధితుడు వివరించాడు. తనిఖీలో భాగంగా కారు నిలపాలని కోరితే వినకుండా వేగంగా పోనిచ్చారని, ఆ సందర్భంలో కారుకు పాక్షికంగా లాఠీ తగిలి ఉండొచ్చని ఎస్‌ఐ వివరించారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు



రాయపల్లిలో నిమజ్జన వేడుకలు



పుట్టపల్లిలో నిమజ్జన కోసం నీటిని తీసుకువచ్చిన మహిళలు



గణేష్ విగ్రహంపై పాలు, నీరు పోస్తున్న గ్రామస్తులు

రాజాపూర్: రాయపల్లి గ్రామంలో వరలక్ష్మి యువజన సంఘం, వంశరాజుల యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకులు ఆదివారం నిమజ్జనానికి తరలారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించిన అనంతరం సాయంత్రం లంబోధరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు.

పుట్టపల్లిలో ప్రత్యేకంగా...

దేవరకద్ర రూరల్: మండలంలోని వివిధ గ్రామాలల్లో ఆదివారం గణేష్ నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. పుట్టపల్లిలో మట్టి వినాయకుడి నిమజ్జనం ప్రత్యేకంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువకులు ప్రతి ఇంటి నుంచి ఒక బిందె నీరుతో పాటు పాలు తీసుకువచ్చి విగ్రహంపై పోస్తూ శివాలయం వద్ద నిమజ్జనం చేశారు. మరుసటి రోజు ఆ మట్టిని రైతులు తీసుకెళ్లి పొలాల్లో చల్లుకుంటారని, తద్వారా మేలు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాగా వేడుకల్లో భాగంగా నిర్వహించిన వేలంలో స్వామి వారి లడ్డూను రూ.48 వేలకు గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి దక్కించుకున్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని పలు వాడల్లో ప్రతిష్ఠించిన గణనాథుడికి ఆదివారం రాత్రి ఘనంగా పూజలు నిర్వహించారు. దేవరకద్రలోని తీగలప్ప కట్ట, పోస్టాఫీసు కుర్వవాడ, వీరప్పయ్యస్వామి దేవాలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయం, బాలాజీ నగర్, బీసీ కాలనీ, రైల్వే స్టేషన్, శివాజీ నగర్, దళితవాడ, తెలుగువాడ, తదితర ప్రాంతాలల్లో వేడుకలు కొనసాగాయి.

నేడు అన్నదానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్ రవినాయక్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వివరించారు.

గణపతి లడ్డూ రూ. 1,02,116



మిడ్జిల్: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం దగ్గర ఆదివారం రాత్రి లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూను దక్కించుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు. చివరకు వేలం పాటలో మిడ్జిల్‌కు చెందిన మన్యం యాదిరెడ్డి రూ. లక్షా రెండువేల నూట పదహారుకు స్వామివారి మహాప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. లడ్డూను అందజేశారు. అలాగే డ్వాక్రా భవనం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను తుప్పడ పోచయ్య రూ. 26,110కు దక్కించుకున్నారు. అనంతరం వినాయకులను వైభవంగా నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణం, రూరల్, హన్వాడ మండలాలకు చెందిన 42 మందికి రూ.35,24,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు మోతీలాల్, షబ్బీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి అభినందన

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన దివిటిపల్లికి చెందిన 22 నెలల సిద్ధార్థరెడ్డిని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయానికి బాలుడితో పాటు తల్లిదండ్రులు రాగా సన్మానించారు. కాగా 25 రైమ్స్, వారాలు, నెలలు, అక్షరాలు, సంఖ్యలు, పాటలు, శ్లోకాలు వల్లె వేస్తూ బాలుడు రికార్డు సాధించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో బాల మేధావిగా గుర్తింపు పొందుతాడని, జాగ్రత్తగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఉప సర్పంచ్‌పై దాడిని ఖండిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: దామరగిద్ద మండలం పిడంపల్లి ఉపసర్పంచ్ ఉషనప్పపై దాడిచేసి చంపడానికి ప్రయత్నం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నాయకులు అన్నారు. ఈ మేరకు దాడిని ఖండిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కుర్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గోపాల్ మాట్లాడారు. మన్యంకొండ స్టేజీ వద్దకు ఉపసర్పంచ్‌ను పిలిపించి సామూహికంగా దాడి చేశారని, అడ్డుకోబోయిన వారిని వదలలేదని అన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్‌కు న్యాయం జరిగే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. పిడంపల్లి సర్పంచ్ వీరేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల మాణిక్యంరాజు, ఆది విష్ణువర్ధన్, నాయకులు మహేష్, బుగ్గప్ప, నర్సిములు, వెంకటప్ప, బీశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల అనుబంధానికి ముగింపు

- పురపాలక కార్యాలయం కూల్చివేత
- నూతన భవన నిర్మాణం కోసం చర్యలు



ఐదు దశాబ్దాలు సేవలందించిన భవనం (ఫైల్)

జడ్చర్ల టౌన్: ఐదు దశాబ్దాల పాటు బాదేపల్లి పట్టణవాసులకు సేవలు అందించిన భవనం ఇక సెలవు అంటూ నేలమట్టం అయ్యింది. 1965లో నాటి పాలకవర్గం శంకుస్థాపన చేయగా 1966లో ప్రారంభమై గ్రామపంచాయతీ, నగరపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలుగా ప్రజలకు సేవలు అందించిందీ ఈ భవనం. కాగా నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు గానూ దీనిని తొలగించాల్సి వచ్చింది. జడ్చర్ల మండలకేంద్రంలో వ్యాపారకేంద్రంగా పేరుగాంచి. బాదేపల్లి 1965కు ముందు మున్సిపాలిటీగా ఉండింది. ఈ విషయం చాలామంది పట్టణవాసులకు, నేటి లీడర్లకు ఏమాత్రం తెలియని విషయం. నాడు మున్సిపల్ పాలకవర్గం పరిపాలన సౌలభ్యం కోసం ఉన్న చిన్న భవనం చాలదని 1965లో కొత్త భవనం నిర్మాణం చేపట్టేందుకు అప్పటి మున్సిపల్ చైర్మన్ గుబ్బ విశ్వనాథం శంకుస్థాపన చేశారు. ఏడాదిలోనే భవన నిర్మాణం పూర్తి చేసి 1966 జూన్ 10న అప్పటి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. కొన్నాళ్లపాటు మున్సిపల్ కార్యాలయంగా వినియోగించారు. ఆ తరువాత గ్రామాల విభజన, పంచాయతీరాజ్ చట్టంలో వచ్చిన మార్పుల కారణంగా బాదేపల్లి మున్సిపాలిటీ కాస్త మేజర్ గ్రామ పంచాయతీగా మారింది. మున్సిపల్ కార్యాలయ భవనం మేజర్‌గ్రామపంచాయతీ కార్యాలయంగా అందుబాటులోకి వచ్చింది. అలా నాలుగు దశాబ్దాల పాటు అంటే 2012 వరకు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం అందులోనే కొనసాగింది. 2012 డిసెంబర్‌లో బాదేపల్లి నగరపంచాయతీగా మారటంతో అదే భవనంలో కార్యాలయం కొనసాగించారు. ఆతరువాత 2016లో నగరపంచాయతీ స్థానంలో మున్సిపాలిటి ఏర్పడింది. అయినప్పటికీ అదే భవనంలో కార్యాలయం కొనసాగింది. చివరకు శిథిలావస్థకు చేరుకోవటంతో 2017లో పక్కనే మహిళాసంఘం కోసం నిర్మించిన సమావేశ మందిరంలోకి కార్యాలయం తరలించారు. అలా దాదాపు 5 దశాబ్దాల పాటు పట్టణ ప్రజలకు సేవలు అందించి ప్రజల్లో చెరగని ముద్ర వేసిందీ ఈ భవనం. కాంగ్రెస్, టీడీపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సర్పంచ్‌లు, చైర్మన్‌లుగా కార్యాలయంలో పాలన సాగించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు అదే భవనంలో తీసుకున్నారు. అలాంటి భవనం నేడు నేలమట్టం కావడంతో అందులో పాలన సాగించిన ప్రజాప్రతినిధులు, అధికారులు కొంత ఉద్విగ్నానికి లోనవుతున్నారు. ఇదిలా ఉంటే మున్సిపల్ కార్యాలయం కోసం రూ.3కోట్లతో నూతన భవనం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ మేరకు నిధులు సైతం మంజూరయ్యాయి. భవనం నిర్మాణం చేపట్టేందుకు శిథిలావస్థలో ఉన్న పాత భవనం తొలగించటం అనివార్యమైంది. దశాబ్దాలుగా పట్టణ అభివృద్ధిలో కీలకం అయిన భవనం శుక్ర, శనివారాల్లో జేసీబీ సహాయంతో నేలమట్టం చేశారు. దానిస్థానంలో నూతన భవనం త్వరలోనే శంకుస్థాపన జరగనుంది.



నేలమట్టమయిన భవనం

తొలగింపు అనివార్యం

మున్సిపాలిటీ కార్యాలయం కోసం నూతన భవనం నిర్మించేందుకు రూ.3కోట్లు మంజూరయ్యాయి. భవనం నిర్మాణం చేపట్టాలంటే పాత భవనం తొలగించటం అనివార్యం అయ్యింది. మున్సిపాలిటీ కార్యాలయం అందరికీ అందుబాటులో ఉండాలనే సదుద్దేశ్యంతో పాత కార్యాలయం స్థానంలోనే నిర్మాణం చేస్తున్నాం. తొలగించటం బాధాకరమే అయినా తప్పదు.

–దోరేపల్లి లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రణాళికలు లేకుండా చెక్‌డ్యాంల నిర్మాణం

చిన్నచింతకుంట: బీఆర్ఎస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు లేకుండ చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నాడు. ఆదివారం చిన్నచింతకుంటలో పలువురు కార్యకర్తలను పరామర్శించేందుకు వచ్చిన ఆయనకు గ్రామస్తులు వివిధ సమస్యలు వివరించారు. దీంతో ఆయన చెక్‌డ్యాం, శ్మశాన వాటిక తదితరాలను పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాసిరకంగా చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి రూ.కోట్లు దుర్వినియోగం చేస్తోందన్నారు. పక్కనే చెక్‌డ్యాం నిర్మించడంతో నీరు శ్మశాన వాటికలో చేరుతోందన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలన్నారు.

బీఆర్ఎస్‌తో విసుగు చెంది కాంగ్రెస్‌లోకి..



భూత్పూర్: బీఆర్ఎస్‌పై విసుగు చెంది ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసుదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పలువురు గిరిజన నాయకులు పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. అనంతరం 4వ వార్డులోని గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నవీన్ గౌడ్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయక్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిన ధర్మాపూర్ గ్రామస్తులు



మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి దేశ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. ధర్మాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, అధికారులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఆయన గ్రామాభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి నాయకులు బీజేపీలో చేరారన్నారు. కేసీఆర్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. రాఘవేందర్, చెన్నయ్య, పెంటయ్య, వెంకటేష్, పాండు, తిరుమల యాదయ్య, కొత్తూరు రాజు, బైని రాములు మండల అధ్యక్షుడు రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం



అన్నాసాగర్‌లో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్/అడ్డాకుల: బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నాసాగర్‌లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 9 మందికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అండగా ఉండాలన్నారు. ఎంపీపీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటన విజయవంతం చేయాలి

భూత్పూర్: మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు వనపర్తి, దేవరకద్రలో పర్యటించనున్న నేపథ్యంలో నిర్వహించే బహిరంగ సభలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నాసాగర్‌లో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 29న కేటీఆర్ వనపర్తి జిల్లా పర్యటనకు వస్తారని అదేవిధంగా, అక్టోబర్ 4న మంత్రి హరీష్‌రావు దేవరకద్రలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన, మధునాపురం మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవం, కొత్తకోట మున్సిపాలిటీలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ, సంకిరెడ్డిపల్లిలో బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని వివరించారు. కొత్తకోటలో జరిగే భారీ బహిరంగసభ విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్‌కాలనీ పార్కుకు పశువుల తరలింపు



పార్కులో పశువులను చూపిస్తున్న మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని నెలలుగా రోడ్లపై పశువులు తిరుగుతూ వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులతో పాటు పోలీసులను ఆదేశించారు. ఎట్టకేలకు ఆదివారం వారు జడ్చర్ల–రాయచూర్ జాతీయ రహదారిపై మెట్టుగడ్డ వద్ద, అలాగే టీచర్స్‌కాలనీలో ఎక్కడబడితే అక్కడ తిరుగుతున్న 14 పశువుల (ఆవులు, ఎద్దులు) ను ఎలాగోలా పట్టుకుని సమీపంలోని పార్కుకు తరలించారు. వాటికి అక్కడ నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచారు. అవి తిరిగి బయటకు రాకుండా గేట్‌కు తాళం వేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ జవాన్లు సిరాజ్, బాలరాజు, సురేష్, రూరల్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ఎదుట కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ బీసీలకు ఇవ్వాలని కోరుతూ పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం జిల్లా కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. దాదాపు అరగంటపాటు కార్యక్రమం నిర్వహించారు. బీసీ నాయకులకే టికెట్ కేటాయించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ మాట్లాడారు. 2004 నుంచి కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటున్న వారికే టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త నాయకులకు టికెట్ ఇస్తే గ్రామస్థాయిలో ఎవరు పనిచేస్తారో వారికి తెలియని పరిస్థితి ఉంటుందన్నారు. కొత్త వారికి కార్యకర్తల కష్టాలు, బాధలు తెలిసే అవకాశం ఉండదన్నారు. కొత్తవారికి టికెట్ ఇచ్చి పెత్తనం ఇస్తే సహించబోలేదన్నారు. కష్టపడి పడిన వారికి గుర్తింపు ఇవ్వాలన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీ నాయకులకు టికెట్ ఇస్తే వారు కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. నియోజకవర్గంలో బీసీ ఓటు బ్యాంకు ఎక్కువ సంఖ్యలో ఉందని, అందువల్లే స్థానిక బీసీ సామాజిక వర్గానికే టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో రాష్ట్ర నాయకులు రమేశ్, హన్వాడ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మహబూబ్‌నగర్ రూరల్ అధ్యక్షులు రవీందర్ ముదిరాజ్, నాయకులు శివ, చంద్రమౌళి, బొట్టు శ్రీను, రాంచంద్రయ్యతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాజాపూర్: మండల కేంద్రంలో (2001–2002 పదో తరగతి బ్యాచ్) పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణ, విద్యుల్లత, యాదయ్య, శ్రీనివాసరావ్, సుజాత, జీవమ్మ, విద్యార్థులు గౌస్, నరేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: కందూర్‌కి చెందిన బోయ బుడ్డన్న అనారోగ్యంతో ఇంటి వద్ద ఉండి కోలుకుంటుండగా ఆదివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎగ్గని నర్సిములు, సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ తదితరులు ఉన్నారు.